

మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పక్కన ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే జయకృష్ణ, పీఓ, అధికారులు



నృత్య ప్రదర్శనలో బాలికలు

ప్రసిద్ధ ప్రాంతాలతో పర్యాటక నడవ

సీతంపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రసిద్ధ ప్రాంతాలను కలుపుతూ పర్యాటక నడవ ఏర్పాటు చేస్తామని పాలనాధికారి ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆడలి వ్యూ పాయింట్‌ను ఎమ్మెల్యే జయకృష్ణతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సీతంపేటలో రూ.4 కోట్లతో గిరిజన మ్యూజియం, రూ.27 కోట్లతో జగతిపల్లి రిసార్టును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.50 లక్షలతో ఆడలి వ్యూ పాయింటు వద్ద రహదారులు, క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటు, రూ.1.56 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపట్టామన్నారు. వచ్చే పర్యాటక దినోత్సవం నాటికి బెనరాయి, సున్నపుగెడ్డ జలపాతాలను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకంగా గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందితే ఐటీడీఏలు బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో జి.చిన్నబాబు, పర్యాటక అధికారి నారాయణరావు, డీడీ ఎం.అన్నాదొర పాల్గొన్నారు.



పర్యాటకులతో కళకళలాడుతున్న ఆడలి వ్యూపాయింట్

వీవోఏలపై వివక్ష తగదు

వెలుగు పథకంలో పనిచేస్తున్న గ్రామ సమన్వయకర్త (వీవోఏ)లపై వివక్ష తగదని సిటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ అన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ముందు బైఠాయించారు. రాజకీయ వేధింపులతో పలువురిని అకారణంగా తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు. అయిదు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం వెలుగు ఇన్‌ఛార్జి పీడీ సత్యంనాయుడుకు వినతిపత్రం అందజేశారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం



కుంకీలొస్తున్నాయ్

జిల్లాకు రెండు వచ్చే అవకాశం

కొమరాడ, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో అయిదేళ్ల నుంచి ఏనుగుల సంచారం ఎక్కువైంది. పలువురు ప్రాణాలు కోల్పోగా, చాలా మంది రైతులు పంటలను నష్టపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం జరిగిన చర్చల్లో రాష్ట్రానికి 4 ఏనుగులు పంపించేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. మన్యం జిల్లాకు రెండు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి అయిదు గురు ట్రాకర్లను కర్ణాటక పంపించి శిక్షణ ఇస్తారు. తర్వాత పెంపుడు ఏనుగులతో తిరిగి వస్తారు. ఈ లోపు కుంకీ ఏనుగుల కోసం శిబిరం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గతంలో జోగింపేటను అనువైన ప్రాంతంగా గుర్తించినా, పూర్తిస్థాయిలో సౌకర్యాలపై అధ్యయనం చేయలేదు.



కుమ్మరిపేట సమీపంలో..

జిల్లాలోని కొమరాడ మండలం విక్రాంపురం, సివిని, కుమ్మరిగుంట సమీప అటవీ ప్రాంతంలో కరిరాజులు సంచరిస్తున్నాయి. సమీపంలో పొలాల్లోకి వెళ్తుండటంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాయంత్రం వరకు ఎవరూ పొలాల వద్ద ఉండొద్దని రైతులను అధికారులు హెచ్చరిస్తున్నారు.

గృహం.. నవ సంకల్పం

గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు పడకేశాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో నిలిచిపోయిన ఇళ్లను వేగవంతం చేయాలని కూటమి సర్కారు ఆదేశించింది. ఇందుకు వంద రోజుల ప్రగతి లక్ష్యాలను నిర్దేశించడంతో ఆ దిశగా అధికార యంత్రాంగం పరుగులు తీస్తోంది. శ్లాబు స్థాయిలో ఉన్నవి, దాటినవి ముందుగా పూర్తి చేయించాలని ప్రయత్నిస్తున్నారు. వివిధ దశల్లో ఉన్న వాటి వేగవంతానికి లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నారు.

ఈనాడు–పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే–పార్వతీపురం



కేంద్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి గూడు కల్పించాలన్న ఉద్దేశంతో ఆర్థిక సాయం అందిస్తోంది. గత ప్రభుత్వం 'జగనన్న కాలనీలు' పేరు పెట్టుకుని హడావుడి చేసింది. కేంద్ర సాయంతో జిల్లాల వారీగా భారీగా ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు పాటించకుండా అనర్హులకు కేటాయించారు. అప్పటి ప్రజాప్రతినిధులు అనువు గాని చోట లేఅవుట్లకు స్థలాలు గుర్తించి కొనుగోలు చేశారు. అందులో ఒక్కో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ సాయం రూ.1.80 లక్షలు ఇస్తామని చెప్పినా.. అనువుగా లేవని చాలా మంది లబ్ధిదారులు ముందుకు రాలేదు.



పార్వతీపురం మండలం వెంకమ్మపేట కాలనీ

అప్పులు చేయలేమంటూ..

గత ప్రభుత్వ హయాంలో ఉభయ జిల్లాల్లో 1,16,447 మందికి గృహాలు మంజూరు చేశారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఒక్కో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.నాలుగైదు లక్షలు ఖర్చవుతుందని, తమ వల్ల కాదని 16,947 మంది పనులే ప్రారంభించలేదు. డ్వాక్రా సంఘాల నుంచి ఒక్కో లబ్ధిదారుకు అదనంగా రూ.30 వేలు రుణం ఇప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినా స్పందించలేదు.

ఇప్పుడు ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. వంద రోజుల ప్రణాళిక అమలులో విజయనగరం జిల్లాలో 3,654 ఇళ్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 25 నాటికి 1,913 అయ్యాయి. ప్రభుత్వ లక్ష్యంలో 52 శాతమే పూర్తి చేయగలిగారు. మన్యం జిల్లాలో 2,128 ఇళ్లు పూర్తి చేయాలని నిర్ణయించినా 50 శాతం కాలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడం, వానలు కురుస్తుండటంతో లబ్ధిదారులు వేగవంతం చేయలేకపోయారు. క్షేత్రస్థాయిలో అధికారుల కొరత ఉంది. మండలాల్లో ఇంజినీరింగ్ అధికారులు లేకపోవడంతో ఒప్పంద ప్రాతిపదికన వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న వారికి ఏఈలుగా బాధ్యతలు అప్పగించారు.

అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం

లబ్ధిదారులను కలిసి మాట్లాడుతున్నాం. వారిని అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం. ఫిబ్రవరి నాటికి కచ్చితంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో కింది స్థాయి ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాం. మండలానికి ఒక ప్రత్యేకాధికారిని కూడా నియమించాం. శనివారం నుంచి లేఅవుట్లలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– ఎ.శ్రీనివాస్, జి.కేశవనాయుడు, గృహ నిర్మాణ సంస్థ పీడీలు (ఇన్‌ఛార్జి)

ఉభయ జిల్లాలో ప్రగతి ఇలా..

జిల్లా	మంజూరు	పూర్తి	ప్రారంభించనవి	వివిధ స్థాయిల్లో ఉన్నవి	చివరి దశలో ఉన్నవి
మన్యం	34,448	14,821	5,756	11,664	2,128
విజయనగరం	81,999	43,328	11,191	27,480	2,770

జ్వరం వచ్చినా.. నేలపైనే నిద్ర

● కేజీబీవీలకు సమకూరని పడకలు

మారుమూల పల్లెల్లో బాలికలు చదువుకు దూరం కాకూడదని, మధ్యలో ఆపేసిన వారిని మళ్లీ బడి మెట్లు ఎక్కించాలని కేంద్రం కేజీబీవీలను ఏర్పాటు చేసింది. వీరికి ఉచిత వసతి, భోజనం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, కాస్మొటిక్స్‌కు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ జిల్లాలోని ఏ కేజీబీవీలోనూ పడకలు ఏర్పాటు చేయలేదు. దీంతో బాలికలు నేలపైనే నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడింది.

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతానగరం

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 14 కేజీబీవీలు ఉన్నాయి. ప్రారంభంలో 6 నుంచి పదో తరగతి వరకు విద్యను అభ్యసించే అవకాశం ఉండేది. కొన్నాళ్లుగా ఇంటర్మీడియట్‌ను చేర్చారు. ఒక్కో విద్యాలయంలో ఒక్కో గ్రూపు కేటాయించారు. తరగతిలో 40 మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. మొత్తం 3,920 సీట్లకు ప్రస్తుతం 3,400 మంది చదువుతున్నారు. ఇంటర్మీడియట్ తరగతులు మంజూరు చేసిన తర్వాత గదులు, వసతులు కల్పించినా.. ఎక్కడా బాలికలకు మంచాలు కేటాయించలేదు.



బీసీ వసతి గృహంలో వృథాగా మంచాలు

వసతి గృహాల్లో వృథాగా..

గతంలో బీసీ, ఎస్సీ వసతి గృహాలకు మంచాలు సరఫరా చేశారు. అన్నీ రెండు వరుసలు కావడంతో పంకాలు తగులుతున్నాయని ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు కొందరు విద్యార్థులు ఎక్కి, దిగేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చాలా చోట్ల వినియోగించకుండా మూలన పడేశారు. వాటిని కేజీబీవీల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

మరింతగా ముదురుతోంది

కొన్ని రోజులుగా వర్షాలతో జ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉంది. కేజీబీవీల పరిసరాల్లో తుప్పలు ఉండటంతో దోమల విజృంభణతో విద్యార్థినులు జ్వర బాధితులుగా మారుతున్నారు. వీరికి సేవలు అందించేందుకు ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు. కానీ గదుల్లో పడకలు లేకపోవడంతో బాలికలు నేలపైనే నిద్రిస్తున్నారు. దీంతో జ్వరం మరింత ఎక్కువ అవుతోంది. కనీసం సిక్ రూముల్లోనైనా రెండు, మూడు మంచాలు ఏర్పాటు చేస్తే ఉపశమనం ఉంటుందని తల్లిదండ్రులు అంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

కేజీబీవీల్లో బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. పరిసరాల శుభ్రత, తాగునీరు, ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. విద్యార్థినులు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రులకు తీసుకెళ్తున్నాం. పడకల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– పగడాలమ్మ, ప్రాజెక్టు సమన్వయకర్త

జిల్లాలో ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సర్కిల్ కార్యాలయం సేవలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం పర్యవేక్షక ఇంజినీరుగా **కె.చలపతిరావు** బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. మెరుగైన విద్యుతు సరఫరా, పీఎం సూర్యఘర్, ప్రభుత్వ కార్యాలయాలకు సౌర విద్యుత్తు సౌకర్యం, ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి సారిస్తామన్నారు. జిల్లాకు సర్కిల్ కార్యాలయంతో పాటు మూడు ఉపకేంద్రాలు మంజూరైనట్లు చెప్పారు. సర్కిల్ కార్యాలయం ఏర్పాటులో భాగంగా నియంత్రికలు, మీటర్లు, ఇతర సామగ్రి నిల్వ చేసేందుకు నాలుగు ఎకరాల సేకరణకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అదనంగా ఇద్దరు ఈఈలు, అయిదుగురు డీఈలు, పదకొండు మంది ఏఈలు, నలుగురు జేఈలు, పీవో, ఏపీవో, ముగ్గురు జేఏవోలు, తొమ్మిది మంది చొప్పున సీనియర్, జూనియర్ సహాయకులు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు.



అత్యంత వైభవంగా కోటదుర్గమ్మ ఉత్సవాలు



ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, ఉత్సవ పర్యవేక్షకుడు పల్లా కొండలరావు పేర్కొన్నారు. శుక్రవారం ఉత్సవ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఎలాంటి ప్రచార ఫ్లెక్సీలు లేకుండా పవిత్రతను కాపాడతామన్నారు. గర్భాలయంలోకి పరిమిత సంఖ్యలో భక్తులను పంపిస్తామన్నారు. ఉత్సవాలు ముగిసే వరకు కమిటీ సభ్యులు, కూటమి నాయకులు అమ్మ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. తెదేపా పట్టణాధ్యక్షుడు జి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

22 మందితో కమిటీ నియామకం

ఉత్సవాలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో 22 మందితో కమిటీని నియమించారు. వీరిలో జి.దుర్గారావు, ఎస్.రుద్రకోటేశ్వరరావు, డి.వెంకటరమణ, ఎస్.గుప్తా, ఎ.శ్రీను, కె.లక్ష్మీమూర్తి, కె.రవి, బి.వెంకటరమణ, ఎన్.రమేష్, డి.వెంకటరమణ, వి.సంతోష్‌కుమార్, కె.భాస్కరరావు, కె.చిట్టిబాబు, పి.సాయికుమార్, జి.శంకరరావు, చౌదరి, కె.భీమారావు, ఎం.సంతోష్, పి.సంతోష్, ఎం.రామినాయుడు, కె.కుమార్‌రాజా, బి.సుధ ఉన్నారు. వీరు ఈవో సూర్యనారాయణ, అర్చకుడు డి.లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు.

దివ్య పుణ్యక్షేత్రం నిర్మించండి

పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో దివ్య పుణ్యక్షేత్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే విజయచంద్ర కలిసి వినతిపత్రం అందించారు. ఆలయ నిర్మాణానికి స్థానికులు భూవితరణ చేశారని, చదును పనులు చేపట్టి కంచె కూడా వేసినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు నిధులు మంజూరు చేయకుండా వాయిదా వేయడంతో పనులు ఆలస్యం అయ్యాయని వివరించారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం



బాక్సింగ్‌లో మెరుపులు
శిక్షకుడిగా బాధ్యతలు

ఆరో తరగతి చదువుతున్నప్పుడే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకొని నిరంతర సాధనతో క్రీడాకారుడిగా రాణించాడు.. తగిన గుర్తింపు పొంది.. జిల్లాకు పేరు తీసుకొచ్చాడు.. నేడు తనలాంటి వందలాది మందిని తీర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు నగరానికి చెందిన బి.ఈశ్వరరావు.

– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

కంటోన్మెంటు ప్రాంతానికి చెందిన బి.సోములు, సూరమ్మ దంపతుల కుమారుడు బి.ఈశ్వరరావు. తండ్రి పురపాలక సంఘంలో చిరుద్యోగి. తల్లి గృహిణి. బాక్సింగ్ అంటే తమ కుమారుడికి ఎంతో ఇష్టమని గ్రహించి ప్రోత్సహించారు. 1992లో పి.రామకృష్ణ, డి.మారయ్య వద్ద ఓనమాలు నేర్చుకున్న ఈశ్వరరావు ఆ తరువాత ఇండియన్ బాక్సింగ్ ముఖ్య శిక్షకుడు ఇ.చిరంజీవి వద్ద చేరి, తిరుగులేని క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. రాష్ట్రస్థాయిలో 30కు పైగా టోర్నీలు, నేషనల్స్‌లో రెండు, ఆలిండియా మీట్‌లు రెండింట్లో పాల్గొని పతకాలు కొల్లగొట్టాడు. ప్రస్తుతం శాప్ కోచ్‌గా ఉమ్మడి జిల్లాలో సేవలందిస్తున్నారు.

65 మందికి కొలువులు

క్రీడాకారుడిగా రాణించిన తరువాత శిక్షకుడిగా స్థిరపడ్డారు. ఇప్పటికే 200 మంది బాక్సర్లను తీర్చిదిద్దారు. ఇందులో సుమారు 65 మంది వరకు ఆర్మీ, నేవీ, పోలీస్, ఆర్‌పీఎఫ్ విభాగాల్లో కొలువులు సాధించారు. ప్రస్తుతం మరికొంతమంది సాధన చేస్తున్నారు. ఈ ఏడాది యూత్ ఏషియన్ టైటిల్ కోసం పోరాడిన జె.వసంతరావు ఇతని శిష్యుడే. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వసంతరావు గతేడాది అండర్-19 నేషనల్ మీట్‌లో కాంస్యం గెల్చుకున్నాడు. జి.అచ్యుతరావు యూత్ ప్రపంచ కప్ పోటీల్లో రాణించాడు. డి.దేవస్వరూప్ ఈ ఏడాది అండర్-14లో కాంస్యం దక్కించుకున్నాడు. బి.సచిన్, పి.దుర్గాప్రసాద్ సైతం ఇక్కడి వారే.



క్రీడాకారులతో సాధన చేయిస్తున్న ఈశ్వరరావు

విజయనగరం వేదికగా..

కొన్నిరోజులుగా శిక్షణ ఇస్తున్నా. విజయనగరం వేదికగా రాష్ట్రస్థాయి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నాం. నిరుపేద పిల్లలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్నవారిని ప్రోత్సహిస్తున్నాం.

– బి.ఈశ్వరరావు, శాప్ కోచ్, విజయనగరం



2.78 లక్షల మందికి పింఛన్లు

★ నిధులు మంజూరు



న్యూస్‌టుడే– పార్వతీపురం, రాజాం

జిల్లా	సంఖ్య	నిధులు
విజయనగరం	2,78,240	రూ.115.86 కోట్లు
పార్వతీపురం మన్యం	1,42,393	రూ.59.18 కోట్లు

కూటమి సర్కారు ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.4 వేలు ఇస్తున్నారు. అక్టోబరులో పంపిణీకి ఈ నెల 30నే బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించి సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి తొలిరోజే 100 శాతం పంపిణీ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల చేతికి నగదు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఒకవేళ 1న సెలవు దినమైతే ముందు రోజే పంపిణీ చేయాలని ఉత్తర్వులొచ్చాయని విజయనగరం పీడీ కల్యాణ చక్రవర్తి తెలిపారు.

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో)
బొబ్బిలి	42,939	17.91
నెల్లిమర్ల	38,955	16.35
ఎస్ కోట	41,630	17.29
చీపురుపల్లి	38,233	16.00
రాజాం	39,192	16.05
పాలకొండ	36,006	24.30
కురుపాం	39,761	26.60
గజపతినగరం	40,640	16.76
విజయనగరం	29,068	12.39
పార్వతీపురం	38,949	24.28
సాలూరు	29,802	20.23

గిరిజన సంక్షేమ డీడీ సరెండర్

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఉప సంచాలకుడు రుక్మాంగదయ్యను ఆ శాఖ సంచాలకులకు సరెండర్ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం లేఖ రాశారు. ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాలని అందులో కోరారు.



(c) eenadu

ఆలోచనొచ్చింది.. ఆవిష్కరణ మెరిసింది

వాహనాల తయారీలో యువకుడి ప్రతిభ

ఆ కుర్రాడి దృష్టి పడితే.. పాత వాహనాలు రయ్‌మంటూ పరుగులు తీస్తాయి.. సాంకేతిక పరిజ్ఞానానికి సృజన తోడై.. పర్యావరణానికి హాని చేకూర్చని విద్యుత్తు, సౌరశక్తితో నడిచే వాహనాలు దర్శనమిస్తాయి.. తక్కువ ఖర్చుతో వివిధ వాహనాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు బొబ్బిలి మండలంలోని మెట్టవలసకు చెందిన ఉంగట్ల శంకరరావు.

– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం





ఇలా అడుగులు..



కలుపుతీత యంత్రం

బొబ్బిలి ఐటీఐలో శంకరరావు ఎలక్ట్రికల్ కోర్సు చేసి దూరవిద్య ద్వారా డిగ్రీ చదివాడు. తొలుత కూలీలు సమయానికి దొరక్కపోవడం, కూలి రేట్లు పెరిగిపోవడం తదితర సమస్యల్ని గుర్తించి సౌరశక్తితో పని చేసే కలుపుతీసే యంత్రాన్ని తయారు చేశాడు. పాత సైకిల్‌ను సేకరించాడు. నాలుగు చక్రాలు అమర్చాడు. దానికి సౌర పలక ఏర్పాటు చేశాడు. యంత్రం నడపడానికి హ్యాండిల్ కూడా ఇనుప రాడ్లతో తయారు చేశాడు. 24 వాట్ల మోటారు అమర్చాడు. సూర్యరశ్మి లేనప్పుడు ఛార్జింగ్ చేసుకోవడానికి పరికరాలు బిగించాడు. రెండు గంటల పాటు ఛార్జింగ్ చేస్తే దాదాపు 5 గంటలపాటు పనిచేసేలా రూపొందించాడు. అయిదు రోజులపాటు కష్టపడి రూ.2 వేలతో తయారు చేశానని, దీనివల్ల ఎకరానికి రూ.3 వేల వరకు ఆదా అవుతుందని చెబుతున్నాడు.



విద్యుత్తు వాహనం

విద్యుత్తు వాహనం..

వాయు కాలుష్యాన్ని నివారించడానికి విద్యుత్తుతో పనిచేసే చిన్న ద్విచక్ర వాహనాన్ని రూపొందించాడు. పాత ఎక్సెల్ వాహనం, ఇతర సామగ్రితో 24 వాట్ల సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఏర్పాటు చేశాడు. 35 వాట్ల సామర్థ్యం కలిగిన మోటారు అమర్చాడు. రెండు గంటల పాటు ఛార్జింగు పెడితే 25 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవచ్చని చెబుతున్నాడు. రూ.5 వేలు ఖర్చు చేసి, వారం రోజుల పాటు కష్టపడి తయారు చేశానని పేర్కొన్నాడు.

బ్యాటరీ సైకిల్

బ్యాటరీతో నడిచే వినూత్న సైకిల్‌ను తయారు చేశాడు. దీనికోసం రూ.5 వేలు వెచ్చించి 15 రోజులు కష్టపడినట్లు చెప్పాడు. 24 వాట్ల బ్యాటరీ, అంతే సామర్థ్యం ఉన్న మోటారు అమర్చాడు. సైకిల్‌ను నియంత్రించడానికి 30 హార్స్ పవర్ కలిగిన యంత్రాన్ని ఏర్పాటు చేశాడు. నాలుగు గంటలపాటు ఛార్జింగు పెడితే 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయొచ్చని, గంటకు 35 కి.మీ వేగంతో నడుస్తుందని పేర్కొంటున్నాడు శంకరరావు.


సరికొత్త కారు

డీజిల్, పెట్రోల్ అవసరం లేకుండా కేవలం బ్యాటరీతో నడిచే కారును రూపొందించాడు. నెల రోజులు కష్టపడి సుమారు రూ.50 వేలు వెచ్చించి, దీన్ని తయారు చేశాడు. సమీపంలోని గ్యారేజీ నుంచి పాత చక్రాలు, టైర్లు, ఇంజిన్ సేకరించాడు. పాత జింక్ రేకులతో కారు పైకప్పు ఏర్పాటు చేశాడు. ఇందుకోసం వెల్డర్ సాయం తీసుకున్నాడు. 48 వాట్ల సామర్థ్యం ఉన్న నాలుగు బ్యాటరీలను అమర్చాడు. ముందుకు, వెనక్కి వెళ్లడానికి వీలుగా గేరు మోటారు బిగించాడు. కారులో నలుగురు కూర్చోవడానికి వీలుగా రెండు వరుసల్లో సీట్లు ఏర్పాటు చేశాడు. గంటపాటు ఛార్జింగు చేస్తే 30 కి.మీ దూరం వెళ్తుందని శంకరరావు అంటున్నాడు. దీనినే ప్రస్తుతం బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, సాలూరుకు వెళ్లడానికి ఉపయోగిస్తున్నానన్నారు. గతంలో పిచికారీ చేసే యంత్రం, బావి నుంచి పొలాలకు నీరు తోడే యంత్రం కూడా తయారు చేశాడు.



తయారు చేసిన కారు

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న లెండి కళాశాల యాజమాన్య ప్రతినిధులు

డెంకాడ, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం డెంకాడ మండలం జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.5 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించింది. సంబంధిత చెక్కును కళాశాల ఛైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ విశాఖపట్నంలోని తెదేపా కార్యాలయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు గురువారం రాత్రి అందజేశారు. యాజమాన్య ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి విజయకల్యాణి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని పందిరప్పన్న కూడలి సమీపంలో ఉన్న ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఇక్కడి సదుపాయాలపై సంక్షేమాధికారిణి విజయనిర్మల, సిబ్బందిని ఆరా తీశారు. ఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు. తీసుకున్న చర్యలపై తహసీల్దారు అరుణకుమారిని ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యాయమూర్తి స్థానిక సబ్‌జైలును సందర్శించారు.

నెలలుగా జీతాల్లేవ్!!



కలెక్టరేట్‌కు వచ్చిన జీడీఏ ఉద్యోగులు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజ, ఘోష ఆసుపత్రులు, వైద్య కళాశాలలో పనిచేస్తున్న 48 మంది కింది స్థాయి ఉద్యోగులకు 14 నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. దీంతో కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర, ఘోషాసుపత్రులను వైద్య కళాశాలలో కలిపారు. అందులో భాగంగా పొరుగు సేవల విభాగంలో క్లాస్- 4(జీడీఏ, ఆఫీస్ సబార్డినేటర్, స్టోర్ అటెండెంటు తదితర) ఉద్యోగులను నియమించారు. మొదటి విడతలో 150 మందిని తీసుకున్నారు. వీరికి ఎనిమిది నెలల తరువాత ఆప్కాస్ ద్వారా జీతాలు పడ్డాయి. రెండో విడతలో నియమితులైన 48 మందికి ఇంకా వేతనాలివ్వలేదు.

నగదు డిమాండు

గత ప్రభుత్వ హయాంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి జీతాలు రాకుండా అడ్డుపడ్డారనే ఆరోపణలున్నాయి. దీంతో కొందరు నేరుగానే విమర్శలు చేశారు. ఏమీ ముట్టజెప్పకుండానే ఉద్యోగాలు కొట్టేశారని, రూ.50 వేల చొప్పున ఇస్తే జీతాలొచ్చేలా చేస్తానని సదరు వ్యక్తి తమను డిమాండు చేశారని పలువురు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు కలగజేసుకుని ఎన్నికల తరువాత ఇస్తామని చెప్పడంతో సద్దుమణిగారు. కానీ నేటికీ అందలేదు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

కొత్త ప్రభుత్వం వచ్చాక సిబ్బంది కలెక్టర్ అంబేడ్కర్‌ను, ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కలిసి వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వం ఆర్థిక శాఖ నుంచి అనుమతులు తీసుకోకుండా నియమించేసిందని, ఆప్కాస్ వెబ్‌సైట్ సైతం మూతపడడంతో బిల్లులు పెట్టే పరిస్థితి లేదని వారు స్పష్టం చేశారు. ఈక్రమంలో చిరుద్యోగులు కావడంతో నెలకు రూ.5 వేల చొప్పున ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు నెలలకు సంబంధించి అందజేశారని, తరువాత ఆపేశారని మళ్లీ నిరసనకు దిగుతున్నారు.

వారివీ అవే కష్టాలు..

వైకాపా హయాంలో ప్రారంభమైన మత్తు వ్యసనపరుల విముక్తి కేంద్రంలో పనిచేసిన ఉద్యోగులదీ ఇదే పరిస్థితి. ఈ విభాగంలో ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, కౌన్సిలర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇలా 8 నుంచి 10 మందిని నియమించారు. వీరి కోసం ప్రత్యేకంగా ఓపీ, ఐపీ గదులు, చికిత్స కోసం పడకలు, యోగా గది, కౌన్సెలింగ్ కేంద్రాలను సమకూర్చారు. అయితే జీతం సక్రమంగా రావడం లేదని, 8 నెలల బకాయి ఉందని వైద్యాధికారి గతంలోనే బయటకు వెళ్లిపోగా, ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులు సైతం మానేశారు. మిగిలిన వారికి నేటికీ ఎదురుచూపులు తప్పడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి..

ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో పనిచేసున్న వారి జీతాల కోసం ఇటీవల చర్చకు వచ్చింది. సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారికి నగదు ఇచ్చేందుకు ప్రత్యేకంగా బడ్జెట్ లేదు. అక్కడి నుంచి అనుమతులు వస్తే అందజేస్తాం.

– ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంటు, మహారాజా ఆసుపత్రి

ఆరోగ్యంగా ఉంటేనే విధుల నిర్వహణ సాధ్యం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నిరంతరం ప్రజా సేవలో ఉండే పోలీసులు ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే విధి నిర్వహణలో పక్కాగా పనిచేయగలరని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా నగరంలోని పోలీసు కార్యాలయంలో తిరుమల- మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై దృష్టిసారించాలని కోరారు. అవసరమైన వారికి నిపుణులతో కూడిన వైద్య సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ● అంతకుముందు 'పోలీసు వెల్ఫేర్ డే'ను నిర్వహించారు. సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు.

వేలిముద్ర వేయించి.. డబ్బులు కాజేసి

మక్కువ, న్యూస్‌టుడే: నిరక్షరాస్యతను ఆసరాగా తీసుకుని ఓ వృద్ధురాలి వేలిముద్రతో నగదు కాజేశాడు ఓ బ్యాంకుమిత్ర. ఈ ఉదంతం మక్కువ మండలం లింగాడవలసలో శుక్రవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన వృద్ధురాలు బి.కాంతమ్మ ఖాతాలో గతంలో ఇంటి బిల్లు జమైంది. ఆ సొమ్ము వచ్చినట్లు ఆమెకు తెలియదు. వెంకట భైరిపురంలో బ్యాంకుమిత్రగా సేవలందిస్తున్న ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చి గృహనిర్మాణ సంస్థ అధికారిగా చెప్పి బయోమెట్రిక్ వేయించి ఆగస్టు 17న రూ.30 వేలు తీసేశాడు. దీని గురించి ఎవరూ అడగకపోవడంతో ఈనెల 9న మరో రూ.30 వేలు డ్రా చేశాడు. 17న మళ్లీ వేలిముద్ర వేయించడానికి రాగా.. కొంత మంది ప్రశ్నించడంతో పరారయ్యాడు. బాధితులకు అనుమానం వచ్చి మరో బ్యాంకుమిత్ర వద్ద ఖాతా వివరాలు ఆరా తీసి.. అప్పటికే రూ.60 వేలు దోచేసినట్లు గ్రహించారు. అదే కుటుంబంలోని డి.సుజాత ఖాతాలో నాలుగేళ్ల కిందట రూ.10 వేల చొప్పున మరో వ్యక్తి రూ.30 వేలు దోచేశాడు. ఈ విషయంపై నిందితుడిని బాధితులు ప్రశ్నించగా.. కాంతమ్మ ఖాతాలో ఈనెల 19న రూ.60 వేలు వేశాడు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎస్‌బీఐ మేనేజర్ శాంతికళ చెప్పారు.

బంగారం చోరీ కేసులో నిందితురాలి అరెస్టు

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: బంగారం చోరీ కేసులో నిందితురాలిని ఒక్క రోజులోనే విశాఖ రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 46 గ్రాముల ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారి వివరాల ప్రకారం.. కొత్తవలస మండలం మంగళంపాలెం సమీపంలోని ఆళ్లవారివీధికి చెందిన ఎ.లత ఈనెల 26న తోడికోడళ్లతో కలిసి బంగారం కొనేందుకు విశాఖ సంపత్ వినాయగర్ సమీపంలోని ఓ దుకాణానికి వెళ్లారు. అక్కడ 46 గ్రా. ఆభరణం కొన్నారు. తర్వాత ఆటో ఎక్కి కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. అక్కడ కొత్తవలస వెళ్లే బస్సు ఎక్కారు. ఈక్రమంలో తన బ్యాగును తనిఖీ చేసుకోగా ఆభరణం కనిపించలేదు. దీంతో రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈస్ట్ క్రైమ్ సీఐ రాజులనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై సునీల్ దర్యాప్తు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలు కొత్తవలస ప్రాంతానికి చెందిన జి.తులసిగా గుర్తించి అరెస్టు చేశారు.

నిపుణులు లేక సేవలు దూరం



వైద్యవిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా కేంద్రంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగంలో సివిల్ సర్జన్ పోస్టు ఖాళీ కావడంతో ఆ ప్రభావం రోగులపై పడింది. శస్త్రచికిత్సలు, సదరం ధ్రువపత్రాల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విభాగం వద్ద రోజూ 150 వరకు ఓపీ నమోదవుతోంది. వారానికి నాలుగు వరకు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంది. అయితే సివిల్ సర్జన్ శివప్రసాద్ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ప్రస్తుతానికి అసిస్టెంటు సివిల్ సర్జన్, నలుగురు జూనియర్ వైద్యులే నెట్టుకొస్తున్నారు.

కీలకమైనా.. గత ప్రభుత్వ హయాంలో కేంద్రాసుపత్రిని వైద్య కళాశాలలో విలీనం చేశారు. అందుకు తగ్గట్టుగా ఆచార్యుడు, సహాయ ఆచార్యుడు, ఇద్దరు అసిస్టెంట్లు ఉండాలి. ప్రస్తుతం ఒక అసిస్టెంటు ప్రొఫెసర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 15 ఏళ్ల కిందట ఈ ఆసుపత్రిలో ఇద్దరు సివిల్ సర్జన్లు ఉండేవారు. ఒకరు మొబైల్ యూనిట్, మరొకరు ఆసుపత్రి యూనిట్‌లో ఉండేవారు. అప్పట్లో సేవలు అంతంతమాత్రమే. వారిద్దరూ వెళ్లాక మరొకరు వచ్చినా ఉద్యోగ విరమణ పొందడంతో కంటి విభాగాన్ని చూసేవారే కరవయ్యారు. మరోవైపు కంటి అంధత్వ నివారణ సంస్థకూ అధికారి లేకపోవడం గమనార్హం. కొన్ని నెలలుగా ఉప డీఎంహెచ్‌వో ఎన్.సూర్యనారాయణ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నాయి. అయితే వైద్య శిబిరాలు, శస్త్రచికిత్సలు మాత్రం జరగడం లేదు. సేవలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని **ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు** తెలిపారు.

చిన్నారులకేం తెలుసు.. ప్రమాదం పొంచి ఉందని

మక్కువ మండలంలోని నంద అంగన్‌వాడీ కేంద్రం ప్రమాదస్థితిలో ఉంది. మట్టిగోడలతో నిర్మించిన పురాతన పెంకుటిళ్లు ఒకవైపు ఒరిగి ఉండటంతో కర్ర అడ్డు పెట్టి దన్నుగా ఉంచారు. ఇక్కడ సుమారు 14 మంది చిన్నారులకు ఆరుబయట గడపలో చదువులు చెబుతున్నారు. మౌలిక సౌకర్యాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఏళ్లుగా అవస్థలు తప్పడం లేదు. కొత్త భవన నిర్మాణం మూడేళ్ల క్రితం ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేశారు. దీనిపై సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. **– న్యూస్‌టుడే, మక్కువ**



వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుక



కేకు కోస్తున్న కాయల సూరారెడ్డి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కేవీఆర్ గ్రూప్ ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. తన సహచరులతో కలిసి తిరుమలలో వెంకన్న స్వామిని దర్శించుకుని, అనంతరం కేకు కోశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. విశాఖ జిల్లా సీతమ్మధారలోని కేవీఆర్ ఎస్టేట్ కార్యాలయంలో ఆయన సోదరుడు కాయల సూరారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

29న పీఆర్టీయూ సదస్సు.. విజయనగరం అర్బన్: పీఆర్టీయూ ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సును ఈనెల 29న విజయనగరంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రవీంద్రనాయుడు, డి.శ్రీనివాస్ తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BATH CLEANING

శ్రీ కనకదుర్గ హౌస్ కీపింగ్ సర్వీస్ మీ ఇంటి వద్దకు వచ్చి పరిశుభ్రంగా సకాలంలో చేయబడును. (టాయిలెట్, హౌస్, సోఫాసెట్, డస్ట్, గ్లాస్, వాటర్ ట్యాంక్ Etc.,) ✆ 8520804641, 9959138591.

REAL ESTATE

FLAT FOR SALE

2BHK 925 Sft. E/F 5 Yrs. Old Flat Sevasadhan Sainagar, Thotapalem, Near RTC Complex, Gayatri College, Sri chaitanya College, VZM 9933238460.

Flat for Sale: Sai Sravani Residency, Flat F2, 2nd Floor, Sunkaraveedhi, Vizianagaram. Area 900 S.Ft. Ph: 99087 33147.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 90008 66020

HOUSE FOR SALE

VZM టౌన్ తోటపాలెం RTC కాంప్లెక్స్ దగ్గర సాయినగర్ East Facingతో ఇల్లు అమ్మకానికి కలదు. 302 గజాలు D.No. 8.30-13/1 with full water ✆ 9494014654.

PLOT FOR SALE

BUDA Approved 167 Sq.Yards plots for sale Komatipalli - Bobbili TBR Engg College. Cost 6,80,000/-. Contact: 9492448528

VZM- VSP హైవే అయినాడ 5th బెటాలియన్ దగ్గర వెంటనే ఇంటిని కట్టుకునే VMRDA ప్లాట్లు అతితక్కువ ధరలో బ్యాంక్ లోన్‌తో కలవు. ✆ 9971116164.

Tagarapuvalasa Y Jn. Facing NH Bhoomatha Prashant Vihar 183, 180 Anandapuram @ Sontyam Bhoomatha Aroma Valley 167 Sq.Yd. Ph: 9866844433.

విజయనగరం-అరకు 100 Ft హైవేకు ఆనుకొని కొర్లాం గ్రామ పరిధిలో 6 లైన్స్ హైవే దగ్గరలో 355 చ.గ. లే-అవుట్ ప్లాట్ అమ్మబడును. ✆ 7730818466.

VZM టౌన్, రింగ్‌రోడ్, SVN నగర్ జ్ఞానసరస్వతి టెంపుల్ (Opp.) ఉడా అప్రూవ్డ్ లే అవుట్ (45x50), 250 Sq. Yds. West Facing అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీ ✆ 9849128770, 9059705269.

బొబ్బిలి-రామభద్రపురం హైవే ఆనుకొని 340 గజాల స్థలం అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీస్ ఓన్లీ ✆ 9996298999.

విశాఖ చుట్టు ప్రక్కల VMRDA అప్రూవ్డ్ ఇళ్ల స్థలాలు స్పాట్ / వాయిదాలతో & బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మకం. గరిమెళ్ళ పద్మావతి 9493640700, 9493640600.

JOBS

హైదరాబాద్ స్టార్ హోటల్స్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లలో బాయ్స్ & గర్ల్స్ కావలెను. రూమ్, ఫుడ్ బస్ పాస్ ఫ్రీ. శాలరీ: 16000-25000. Ph: 9550110629, 8466882075

PAYTM Wanted FSEs, SKLM Dt., 12th pass, 21k Monthly + Incentive on roll Job, Sales Experience 1 Yr. Bike & Smart phone Ph: 6300795655.

KHK Group నందు పనిచేయుటకు సేల్స్ పర్సన్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్ కలదు. కోళ్ళ బజార్, విజయనగరం. Cont : 8977169444, 9888649444.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్దులను / పేషంట్స్ / చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18k. ✆ 96405 28899, 96406 48899.

30 మందికి వంట చేయుటకు అనుభవం కలిగిన ఆడ వంట మనిషి ఉండిపోయేలా కావలెను. 12 వేలు జీతం, వసతి, భోజన సదుపాయం కలదు. కైలాసగిరి వైజాగ్ ✆ 7093485792.

ప్రైవేట్ బ్యాంకులో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్, హౌస్‌కీపింగ్, గ్రౌండ్‌స్టాఫ్, టెక్నీషియన్స్, సిస్టం ఆపరేటర్స్, సివిల్ వర్కర్స్ కావలెను. Ph: 8520835183.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జానపద కళల ప్రదర్శనకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 13, 14వ తేదీల్లో లయన్స్ కమ్యూనిటీ భవనంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు జానపద కళల ప్రదర్శనలు ఉంటాయని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు బి.రామానందం తెలిపారు. పాల్గొనాలనుకునేవారు 2వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కళాకారులు స్థానికులై ఉండాలని, కళా ప్రదర్శన 15 నిమిషాలు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. వివరాలకు 89192 22064, 93475 22850 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నాటికలు, ఏకపాత్రాభినయాలు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 13, 14వ తేదీల్లో గురజాడ కళాభారతిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నాటికలు, ఏకపాత్రాభినయాల ప్రదర్శన ఉంటుందని జిల్లా ఆడిట్ అధికారిణి బి.అరుణకుమారి తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 2వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని కోరారు. స్థానికులకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 73968 32929, 95151 29843 నంబర్లను సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

బదిలీలు.. బాధ్యతలు



కలెక్టర్ అంబేడ్కర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అబ్కారీ అధికారి శ్రీనాథుడు

విజయనగరం అర్బన్, రింగురోడ్డు, న్యూస్‌టుడే: ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన పలువురు జిల్లా అధికారులు శుక్రవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా నుంచి వచ్చిన ఇ.నర్సింహారెడ్డి గనులు భూగర్భశాఖ అధికారిగా, అనకాపల్లిలో పనిచేసిన ఇ.సందీప్ డ్వామా పీడీగా, గుంటూరు జిల్లా నుంచి స్థానచలనం పొందిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

జడ్పీ సీఈవోగా సత్యనారాయణ

విజయనగరం అర్బన్: జిల్లా పరిషత్తు సీఈవోగా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పరిపాలనాధికారిగా పనిచేస్తూ సీఈవోగా చేరారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛమందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్‌ను కలిశారు.

జలవనరుల ఈఈగా రమణ

అయ్యన్నపేట: జలవనరుల శాఖ ఈఈగా ఎంవీ.రమణ నియమితులయ్యారు. ఇంతవరకు ఆయన శ్రీకాకుళంలో విధులు నిర్వహించారు. ఇక్కడున్న ఎంఏ.సీతారామునాయుడు ఆమదాలవలస వెళ్లనున్నారు. ● లోతుగెడ్డ డీఈ ఎల్.గోవిందరావు విజయనగరం సబ్ డివిజన్ డీఈగా రానున్నారు. అక్కడి డీఈ బి.సంతోష్‌కుమార్ పార్వతీపురం డీఈగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ● టీటీపీఆర్(రాజాం) డీఈ ఎల్.నవీన్ లోతుగెడ్డకు నియమితులయ్యారు. ● విశాఖపట్నంలో డీఈగా చేస్తున్న శ్రీచరణ్ ఎస్.కోట సబ్ డివిజన్ డీఈగా వెళ్లనున్నారు. అక్కడున్న కె.రమణ విశాఖపట్నం బదిలీ అయ్యారు.

బీసీ సంక్షేమాధికారి బదిలీ

మయూరికూడలి: ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమాధికారి కె. సందీప్ కుమార్ కర్నూలు ఆర్డీవో వెళ్లనున్నారు. ఇక్కడ ఇంకెవరినీ నియమించలేదు.

రెవెన్యూ శాఖలో..

పార్వతీపురం: కేఆర్సీ ఉపకలెక్టరు (ఇన్‌ఛార్జి డీఆర్వో) జి.కేశవనాయుడు అనంతపురం ఆర్డీవోగా వెళ్లనున్నారు. ఆయన ఇక్కడ గృహనిర్మాణ సంస్థ పీడీగానూ ఉన్నారు. ఆయా స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. పలువురు తహసీల్దార్లను బదిలీ చేసి, బయట జిల్లాల నుంచి వచ్చిన కొందరికి స్థానాలు కేటాయిస్తూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 23 మంది ఉప తహసీల్దార్లు, 124 మంది వీఆర్వోలకు స్థానచలనం కల్పించారు.



జడ్పీ సీఈవోకు శుభాకాంక్షలు చెబుతున్న ఉమ్మడి జిల్లా అధికారులు, ఉద్యోగులు

దేవాదాయ శాఖ ఏసీగా శిరీష



కంటోన్మెంట్: దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా కె.శిరీష శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడున్న సుధారాణి అనకాపల్లి జిల్లాకు వెళ్లారు. శిరీష గతంలో రామతీర్థం కార్యనిర్వహణాధికారిణిగా, శ్రీకాకుళం జిల్లా సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు సత్తా



ట్రోఫీతో జిల్లా క్రీడాకారిణులు, నిర్వాహకులు

మునగపాక, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా మునగపాకలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో విశాఖ, తరువాతి స్థానాల్లో శ్రీకాకుళం, గుంటూరు జట్లు నిలిచాయి. విజేతలకు ఆర్ఈసీఎస్ మాజీ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాదు, ఆడారి కృష్ణ, టెక్కలి పరశురామ్, ఆడారి గణపతి అచ్చింనాయుడు తదితరులు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పలగరలోని గుడివాడ కాలనీ ప్రాథమిక పాఠశాలకు మట్టి రోడ్డుపై వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో బురదగా మారడంతో అవస్థలు తప్పడం లేదు. - **స్థానికులు**

● ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకువెళ్లి చర్యలు చేపడతాం. - **ఎస్.సింహాచలం, ఎంఈవో** – న్యూస్‌టుడే, బలిజిపేట.

? పాలకొండ పట్టణ ప్రధాన రహదారిలో దుమ్ము రేగుతోంది. - **ప్రవీణ్**

● పారిశుద్ధ్య కార్మికులతో రహదారి శుభ్రం చేయిస్తాం. - **దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ.** – పాలకొండ గ్రామీణం

శిథిల భవనం.. చిన్నారుల్లో భయం



బూరుగలో ఇలా..

వీరఘట్టం మండలంలోని పలు పాఠశాలల్లో గదులు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. దశుమంతపురం పాఠశాల ఆవరణలో భవనం తొలగించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఎమ్మెల్యే జయకృష్ణ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన రాలేదు. బూరుగలో భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. కత్తులకవిటి, బిటివాడ గ్రామాల్లోనూ భవనాలు దెబ్బతిన్నాయి. ఎంఈవోలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. పాఠశాల ప్రాంగణాల్లో శిథిల భవనాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం



బిటివాడలో పరిస్థితి..

గెడ్డలుప్పి మార్గం బురదమయం



సీతానగరం, మక్కువ మండలాలకు చెందిన 15 గ్రామాల ప్రజలు సువర్ణముఖి నదిని దాటాలంటే గెడ్డలుప్పి వంతెనపై నుంచి వెళ్లాలి. కానీ ఇక్కడ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. 2014లో తెదేపా రూ.7 కోట్లు మంజూరు చేయగా.. కొత్త వంతెన పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 80 శాతం పూర్తయ్యాయి. దీంతో పాటు చినభోగిల- మక్కువ మార్గం కొత్తవలస వరకు 2 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలతో దారి పూర్తిగా పాడైంది. బురదగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ రామ్మోహనరావు మాట్లాడుతూ.. పనులను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించామన్నారు. ఆ శాఖ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, సీతానగరం

దసరాకు పక్కాగా బందోబస్తు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ దసరా నవరాత్రి ఉత్సవాలకు పక్కాగా బందోబస్తు చేపట్టాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కోట దుర్గమ్మను దర్శించుకొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. చోరీలు జరగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపుపై డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి వివరించారు. ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న పోలీసుశాఖకు చెందిన స్థలం పరిశీలించారు. ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

సాలూరు కమిషనర్‌గా సత్యనారాయణ



సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పురపాలక సంఘం కమిషనర్‌గా నియమితులైన సీహెచ్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బొబ్బిలి పట్టణ అభివృద్ధి సంస్థ (బుడా) పరిపాలనాధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

సీతంపేటలో ఎమ్మెల్యే దీక్ష



దీక్షలో ఎమ్మెల్యే జయకృష్ణ, కూటమి నాయకులు

సీతంపేట, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సీతంపేటలో వేంకటేశ్వర ఆలయం ముందు ఎమ్మెల్యే జయకృష్ణ పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి దీక్ష చేపట్టారు. నాయకులు ప్రసాదరావు, తోటముఖలింగం, పవన్, రామినాయుడు, తేజోవతి, సంధ్యారాణి, రంగనాథం, మాలయ్య, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మారకపోతే ఉపేక్షించం

భామిని, న్యూస్‌టుడే: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పనితీరు మారకపోతే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. కార్యదర్శులతో శుక్రవారం సమావేశమయ్యారు. చెత్త సంపద కేంద్రాలు ఈ నెల 30లోపు పునఃప్రారంభించాలన్నారు. నీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. పంచాయతీల దస్త్రాలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఎందుకు ఉన్నాయని, లాగిన్ పాస్‌వర్డులను ప్రైవేట్ వ్యక్తి ఆపరేట్ చేయడంపై మండిపడ్డారు. మండలం పరిశుభ్రత పనుల్లో వెనుకబడిందని, సిబ్బంది తీరు బాగోలేదన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం



వసతి గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న పీవో

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం గర్భిణుల వసతి గృహాన్ని సందర్శించారు. సౌకర్యాలపై ఏఈ అప్పారావు నుంచి వివరాలు సేకరించారు. కొన్ని నెలలుగా వేతనాలు అందడం లేదని సిబ్బంది పీవో దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కురుపాం మండలం శివ్వన్నపేటలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనం పరిశీలించారు. మిగులు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

ఉద్యోగుల భవిష్యనిధిపై సదస్సు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: ప్రభుత్వ, పౌరుగు సేవల ఉద్యోగుల భవిష్య నిధి (పీఎఫ్) సమస్యల పరిష్కారానికి 'మీ వద్దకే పీఎఫ్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుర కమిషనరు కె.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం పుర కార్యాలయంలో ఉద్యోగులు, కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఖాతాల నిర్వహణ, ప్రయోజనాలను వివరించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

కురుపాం గ్రామీణం: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎల్విన్‌పేట సీఐ హరి అన్నారు. నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో నష్టాలపై వివరించారు.

పట్టణాల్లో.. పట్టని పరిశుభ్రత

వృథాగా మారుతున్న రూ.లక్షల వ్యయం
మూలకు చేరుతున్న వాహనాలు



పార్వతీపురం పుర కార్యాలయం వద్ద పాడైన చెత్త తొట్టెలు

పట్టణాల్లో ఏటా జనాభా పెరుగుతున్నారు. కొత్తకొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. ఇళ్ల నుంచి ఉత్పత్తి అవుతున్న చెత్త రెట్టింపు అవుతోంది. వీధులు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. అయినప్పటికీ వాటిని శుభ్రం చేసే కార్మికుల సంఖ్యలో మాత్రం ఎలాంటి మార్పులు జరగడం లేదు. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉండటంతో పట్టణాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.
– న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలక, సాలూరు గ్రామీణం, పాలకొండ

పూడిక తొలగింపునకే రూ.లక్షలు..

ఏటా కేవలం కాలువల్లో పూడిక తొలగింపునకే పురపాలికలు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నాయి. అయినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు రావడం లేదు. పార్వతీపురం పట్టణంలో 71 కి.మీ మేర కాలువలు ఉన్నాయి. ఏటా పారిశుద్ధ్య నిర్వహణకు రూ.47 లక్షలు ఖర్చు చేస్తున్నారు. పూడికతీతకే ఏటా రూ.10 లక్షలు వరకు అవుతోంది. ❖ పాలకొండ నగర పంచాయతీ 10.74చ.కి.మీ విస్తీర్ణంలో ఉండగా, 70 కి.మీ పొడవున కాలువలున్నాయి. పరిశుభ్రత పనులకు రూ.30 లక్షలు ఖర్చు చేస్తున్నారు. 19 చ.కి.మీ పరిధిలో ఉన్న సాలూరులో ఈ ఖర్చు రూ.50 లక్షలుగా ఉంది.

ఒక్కొక్కటే పనిచేస్తున్నాయి...

గత ప్రభుత్వ పాలనలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి పురపాలక సంఘాలకు చెత్త తొట్టెలు, కాంపాక్టర్లు, పొక్లెయిన్, టిప్పర్లు అందుబాటులోకి తెచ్చారు. పార్వతీపురం, సాలూరు పట్టణాల్లో రెండేసి కాంపాక్టర్లు ఉండగా ఒక్కొక్కటే పని చేస్తున్నాయి. బాబ్‌కార్ట్‌లు సరిపడా లేక వీధిల్లో చెత్త సేకరణ కష్టంగా మారుతోంది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కొనుగోలు చేసిన చెత్త బుట్టలు పాడవుతున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.

శాశ్వత ప్రాతిపదికన చర్యలు..

ప్రజారోగ్య విభాగాన్ని శాశ్వత ప్రాతిపదికన బలోపేతం చేయాలి. పారిశుద్ధ నిర్వహణ నిరంతరం చేపట్టాలి. జవాబుదారీతనంతో పనులు జరిగేలా పర్యవేక్షించాలి. మురికివాడలు ఉన్న ప్రాంతంలో కాలువ వ్యవస్థను మెరుగు పర్చాల్సి ఉంది. పాలిథిన్ నిషేధించాలి. ప్రాంతాల వారీగా పని విభజన చేసి కార్మికులను ప్రోత్సహించాలి.

ప్రత్యేక కార్యాచరణ..

పట్టణాల్లో పరిశుభ్రత మెరుగుకు చర్యలు చేపడతాం. ప్రత్యేక కార్యాచరణతో దశల వారీగా ముందుకు వెళ్తామని పార్వతీపురం, పాలకొండ కమిషనర్లు కె.శ్రీనివాస్, సర్వేశ్వరరావు, సాలూరు ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి రాజీవ్ తెలిపారు.

తీరని కార్మికుల కొరత..

పారిశుద్ధ్య పనులకు కార్మికుల కొరత తీరడం లేదు. పట్టణ జనాభాకు అనుగుణంగా వారి సంఖ్య పెంచడం లేదు. పార్వతీపురం పట్టణంలో జనాభా ప్రస్తుతం 60 వేలకు పైగా ఉన్నా 122 మంది మాత్రమే సేవలు అందిస్తున్నారు. సాలూరులో 120 మంది, పాలకొండలో 60 మంది కార్మికులు సేవలు అందిస్తున్నారు. వీరంతా కొన్ని వీధులకే పరిమితం అవుతున్నారు. శివారు ప్రాంతాలపై దృష్టి సారించలేకపోతున్నారు.



రాజుగారి కోట రహదారిలో చెత్త కుప్పలు

1న కలెక్టరేట్ ముట్టడి



కరపత్రాలు విడుదల చేస్తున్న సుబ్బరావమ్మ, నాయకులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష శుక్రవారం మూడోరోజుకు చేరింది. సిటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బరావమ్మ మద్దతు పలికారు. పట్టణ ప్రజల దాహార్తి తీర్చాలని డిమాండు చేశారు. అక్టోబర్ 1న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సంబంధిత కరపత్రాలు విడుదల చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీదేవి, ఇందిర, సిటు జిల్లా కార్యదర్శి మన్మథరావు, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని మండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. చిన్నారులకు పెడుతున్న ఆహార పదార్థాలు, పరిసరాలు పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామంలోని వీడీవీకేను సందర్శించి ఉత్పత్తులు పరిశీలించారు. నాణ్యమైన ఉత్పత్తులకు నిలయంగా మారాలన్నారు. మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

మెగా వైద్య శిబిరం



పరీక్షలకు వచ్చిన ప్రజలు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని డీకే పట్నంలో లయన్స్ క్లబ్, జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన 600 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రూ.లక్ష విలువైన మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామంలో వైద్యులు మొక్కలు నాటారు. జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు వాగ్దేవి, వైద్యులు పద్మజ, వివేక్, రామ్మోహనరావు, శ్రీరాములు, వసంత్‌కుమార్, దుర్గాప్రసాద్, శ్రీరేఖ, వాసుదేవరావు, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

పరిసరాలు శుభ్రం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రిలో వెంకటరాయుడు కోనేరు గట్టుపై వ్యర్థాల సమస్య పరిష్కారమైంది. ఈ రహదారిపై పట్టణ వీధుల్లో చెత్తను కొన్ని రోజులుగా వేస్తుండడంతో గుట్టలుగా మారింది. 'ఈనాడు'లో ఈ నెల 15న 'పొగ.. సెగ' శీర్షికతో వార్త ప్రచురితమైంది. కమిషనరు ఎస్.సర్వేశ్వరరావు స్పందించి పరిసరాలు శుభ్రం చేయించారు.

పనికిరాని మొక్కల తొలగింపు

బలిజిపేట గ్రామీణం: అరసాడ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అధ్వానంగా మారింది. పనికిరాని మొక్కలు పెరిగాయి. ఇటీవల స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. కార్యదర్శి శ్రీహరి స్పందించి శుభ్రత పనులు చేయించారు. త్వరలో కేంద్రం వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

గుంతల పూడ్చివేత

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ- సీతంపేట రహదారిలో గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో ఇటీవల కథనాలు ప్రచురితమయ్యాయి. తెదేపా మండలాధ్యక్షుడు జి.రామినాయుడు స్పందించారు. సొంత నిధులతో పిక్కరాయి తీసుకొచ్చి గుంతల పూడ్చివేత పనులు చేపట్టారు.

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మద్యం దుకాణం వద్ద గొయ్యి ఏర్పడటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై ఈ నెల 11న స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగాకు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. స్థానిక యువత స్పందించి గుంతలు పూడ్చారు. ఈవోపీఆర్‌డీ గోపాలరావు అభినందనలు తెలిపారు.

మనోభావాలు దెబ్బతీస్తే సహించేది లేదు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత అయిదేళ్ల పాలన సక్రమంగా సాగలేదని ఎమ్మెల్యే టి.జగదీశ్వరి విమర్శించారు. శుక్రవారం తోటపల్లి దేవస్థానంలో జనసేన, తెలుగు దేశం పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. హిందువులు దైవంగా భావించే తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడం సరైన పద్ధతి కాదన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారిని భగవంతుడు క్షమించరన్నారు. నాయకులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.తవిటినాయుడు, వై.శ్రీనివాసరావు, ఎన్.తిరుపతినాయుడు పాల్గొన్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్లలో ప్రయాణికుల ల్యాప్‌టాప్ చోరీ చేసిన కేసులో నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన టి.రామకృష్ణ ఇటీవల ప్రయాణికుల వద్ద రెండు ల్యాప్‌టాప్‌లు చోరీ చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడి బ్యాగు తనిఖీ చేయగా రూ.1.70 లక్షల విలువైన 2 ల్యాప్‌టాప్‌లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.



చిత్రాలు తీసుకుంటున్న కలెక్టర్, అధికారులు



గిరిజన నృత్యాలు చేస్తున్న బాలికలు

ఆడలి వెళ్దాం.. అందాలు చూద్దాం

జిల్లాలోని సీతంపేట మండలంలోని ఆడలి అందరినీ ఆకట్టుకుంటోంది. రూ.2.06 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆడలి వ్యూపాయింట్‌ను అధికారులు ప్రారంభించారు. ఐ లవ్ సీతంపేట బోర్డు వద్ద అందరూ సెల్ఫీలు తీసుకున్నారు. సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, సీతానగరం

సామాజిక తనిఖీలు

జియ్యమ్మవలస: మండలంలో 2023-24లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి గ్రామస్థాయిలో సామాజిక తనిఖీలు శనివారం నుంచి ప్రారంభిస్తామని ఎస్ఆర్‌పీలు బి.దాసు, ఎస్.మాధవరావు తెలిపారు. 31 పంచాయతీల్లో దస్త్రాలను 13 మంది డీఆర్‌పీలు పరిశీలిస్తారన్నారు.

వ్యాసరచన పోటీలు

సీతానగరం: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పర్యాటక దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో సూరిదేముడు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఓటరు నమోదు

కురుపాం గ్రామీణం: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.మహేష్ సూచించారు. కురుపాం, శివ్వన్నపేట పాఠశాలల్లో ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, ఉపేంద్ర, జగదీష్, వేణు పాల్గొన్నారు.

డీఈవోకు వినతి

సీతంపేట: రామానగరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులను సమస్యల నుంచి గట్టెక్కించాలని డీఈవో పగడాలమ్మను గిరిజన సంఘం నాయకులు కోరారు. ఎం.తిరుపతిరావు, శ్రీరాములు, సురేష్, పరశురాం, వెంకన్న, సాయి, సర్పంచి సుందరమ్మ వినతి ఇచ్చారు.

అప్రమత్తత అవసరం

పాలకొండ: వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి వై.మణి ఆదేశించారు. అన్నవరం పీహెచ్‌సీని సందర్శించి ల్యాబ్‌ను పరిశీలించారు. పరికరాలు, మందులపై ఆరా తీశారు.

యువతి అదృశ్యం

సీతానగరం: బూర్జకు చెందిన యువతి రెండు రోజులుగా కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ చెప్పారు.

180 మందికి ఆరోగ్య పరీక్షలు

సాలూరు గ్రామీణం: సాలూరు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఐటీఐ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, కార్యక్రమ సమన్వయకర్తగా కోట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 180 మంది విద్యార్థులకు వైద్యసేవలందించారు. సూపరింటెండెంటు రామునాయుడు, సిబ్బంది ప్రసన్నకుమార్, చంద్రశేఖర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి వైకాపా కౌన్సిలర్లు



శివకుమార్‌తో కౌన్సిలర్లు, నాయకులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పురపాలక సంఘంలోని వైకాపా కౌన్సిలర్లు విశాఖలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ సమక్షంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. పురపాలక ఉపాధ్యక్షురాలు జె.దీప్తి, ఆరో వార్డు కౌన్సిలరు జె.నీలిమ, 16, 4, 2, 11 వార్డుల నాయకులు రాపాక మాధవరావు, గొల్లపల్లి వరప్రసాదరావు, పప్పల లక్ష్మణ, దుర్గ (స్వతంత్ర కౌన్సిలర్) భర్త సింహాచలం తదితరులు శుక్రవారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని నారన్నాయుడువలస, గళావల్లి, పి.చాకరాపల్లికి చెందిన పలువురు జనసేనలో చేరారు. పి.చాకరాపల్లి మాజీ సర్పంచి రావి ఆదిలక్ష్మి, కుటుంబ సభ్యులు, నారన్నాయుడువలసకు చెందిన పోలిరాజు, నర్సింగరావు, కె.రాంబాబు తదితరులు, గళావల్లి గ్రామస్థులు ఎస్.శ్రీనివాసరావు, పి.శంకరరావు, ఎం.గణపతి తదితరులు పాలూరు బాబు ఆధ్వర్యంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బలిజిపేట నాయకులు ఎం.కుమారస్వామి, ఎస్.హరిచరణ్, పి.ప్రసాద్, కె.పకీరునాయుడు, వెంకటరమణ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగమాధవితో గళావల్లి, నారన్నాయుడువలస కార్యకర్తలు

పోషకాహారంతో ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేసిన సిబ్బంది

మక్కువ, న్యూస్‌టుడే: మండలంలోని సరయవలసలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచి తెర్లి మోహిని అధ్యక్షతన గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తింటే ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మిస్తారని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎ.నారాయణరావు, సూపర్‌వైజర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కురుపాం ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని వనజ, జియ్యమ్మవలస టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎ.రవిప్రసాద్, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.



వనజలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఏటీడబ్ల్యూవో

క్రీడలతో గుర్తింపు



హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు మారుమూల పల్లెలకు పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరవాలన్నారు. తెదేపా నాయకులు పద్మావతి, భూషణరావు, లోవరాజు, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పీడీలు మాధవరావు, వాసుదేవరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దారి పొడవునా మొక్కజొన్న

ఇటీవల కురిసిన వర్షాలు మొక్కజొన్న దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. పాచిపెంట మండలంలో 6 వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. సాధారణంగా ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు పంట చేతికి రావాలి. కానీ మండలంలో చాలా చోట్ల 20 క్వింటాళ్లకంటే తక్కువగానే వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. వారం క్రితం వరకు రూ.2,500 కొన్న వ్యాపారులు ప్రస్తుతం రూ.2,400కు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట



నీమాస్త్రంతో రైతులకు లాభాలు

భామిని: వరి పైరులో నీమాస్త్రం వేస్తే అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఏ మురలయ్య అన్నారు. శుక్రవారం పోలవరంలో నీమాస్త్రం తయారీ గురించి రైతులకు వివరించారు. ద్రావణం 2, 3 సార్లు పిచికారీ చేస్తే వరి, ఇతర పంటల్లో శత్రు పురుగులు గుడ్లు పొదగకుండా నాశనం అవుతాయన్నారు. సర్పంచి బి.నారాయణ, సిబ్బంది బాలకృష్ణ, ధర్మారావు ఉన్నారు.

పాచిపెంటలో గంజాయి పట్టివేత

పాచిపెంట, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు పాచిపెంట ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అనిల్, అతని స్నేహితుడు భరతుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై కిలో గంజాయి తరలిస్తూ మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. ఒడిశా రాష్ట్రంలోని సుంకిలో గంజాయి కొనుగోలు చేశామని వారు అంగీకరించారు. సరకు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఇద్దరినీ అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu